# లక్కీ ఛాన్స్

రాజేశ్వరమ్మ చనిపోయింది. ఆమె కోడలు పంకజవల్లి భోరున ఏడుస్తోంది. ఎంత మంది ఎన్ని రకాలుగా ఓదార్చినా ఊరుకోవటం లేదు.

"అత్తో! ఓ అత్తో!'' అంటూ దీర్ఘాలు తీస్తు పొర్లిపొర్లి ఏడుస్తోంది.

మధ్య మధ్యలో 'నాకింకెవరు దిక్కు అత్తో!' అంటోంది. గుండెలు బాదుకుని మరీ ఏడవసాగింది.

భర్త రామలింగం "ఊరుకోవే..శోషొచ్చి పడిపోతావేమో!'' అని అంటే కూడా-

"పోనీవండి...ఈ పాడుకాయం...అత్త లేకపోయాక...నేను బ్రతికి మాత్రం ఏం ప్రయోజనమండీ...ఈపాడు బ్రతుకు బ్రతకటంకన్నా అత్తతో పాటు పోవటం మేలండీ...'' అంటూ కళ్ళు తుడుచుకుంది.




"చూడమ్మా! అత్త అంటే ఎంత ప్రాణమో!'' అంటూ బుగ్గలు నొక్కుకుంది పక్కింటి పార్వతమ్మ.

"మరే..ఇంట్లోనుండి బయటకి రారనుకో...ఇద్దరూ ఎదురెదురుగా కూర్చుంటారా...ఒకటే గుసగుసలు, పకపకలు...ఏం మాటలుంటాయోగానీ...పొద్దస్తమానం మాటాడుకుంటూనే ఉంటారు.. మాది ఎదురిల్లేగా..చూస్తుంటాను కదా...ఇరుగుపొరుగు వాళ్ళతో ఒక్కమాట లేదు.. ఒక్క పలకరింపు లేదు...ఆ అత్తాథ కోడళ్ళ యవ్వారం నాకైతే అంతు పట్టడం లేదమ్మా'' చేతులూ, మూతీ అటూ ఇటూ తిప్పుతూ కళ్ళు చక్రాల్లా తిప్పుతూ అంది సుబ్బాయమ్మ.

"అత్తో! ఓ అత్తో...నన్నేం చెయ్యమంటావత్తో. నువ్ లేకుండా నేనెలా బ్రతకనత్తో...వేళకి మాత్తర్లు ఎవరికివ్వనత్తో...కంచంలో అన్నం ఇంక ఎవరికివేసివ్వత్తో...నన్నన్యాయం చేశావుకదత్తో...'' అలుపూ సొలుపూ లేకుండా ఏడుస్తూనే వుంది పంకజవల్లి.

ఇంతలో ఎలా వాసన (ఏడుపు వాసనని)బట్టారోగానీ సిటీలోని టీవీ ఛానల్స్ మొత్తం వచ్చేశాయ్.

★★★

పక్కరోజు అన్ని ఛానల్స్‌లోనూ ఇదే.

అత్త-కోడళ్ల ప్రేమాభిమానాలు.

అత్తని తల్లిలా చూసిన కోడలు.

అత్తని దుత్తలా విసిరిపారేయకుండా, కొత్త కుండలా చూసుకున్న కోడలు.... వంటి వ్యాఖ్యలతో లక్ష తొంభయ్ ఛానల్స్ పంకజవల్లి ప్రోగ్రాంని చూపించాయ్.

సంతృప్తిగా ఫీలైంది పంకజవల్లి.

"ఎందుకే నిన్న అంత రాద్ధాంతం చేశావ్?అసలు నాకేం అర్థం కావడంలేదు'' అని అడిగిన తోడికోడలితో-

"ఇందుకు...!'' అంటూ టీవీవైపు చూపించింది.

"లేకపోతే..నాకు ఇంత పబ్లిసిటీ వచ్చేదా? ఇన్ని ఛానల్స్‌లో నేను కనిపించేదాన్నా? ఇప్పుడు నేను పబ్లిక్ ఫిగర్‌నయ్యాను కదా... అంత డబ్బుపోసి టీవీకొన్నాం...గంటల పర్యంతం దానెదురుగా కూర్చుని అది ప్రసారం చేసే డబ్బా సీరియల్స్ చూశామా ? మరి మనకేంటి లాభం? ఇదిగో ఇది...టీవిని ఎలా ఉపయోగించుకోవాలో తెలిసిందా? ఇప్పుడు నేను రేపు కార్పొరేటర్‌గా నిలబడ్డా దిగుల్లేకుండా బంపర్ మెజారిటీతో తప్పకుండా గెలుస్తానన్న నమ్మకం నాకుంది. ...కాకపోతే..మనకి ఖర్చయిందేమిటి? ఏడుపు...రేపు నాకు సానుభూతితో ఎన్ని ఓట్లు పడతాయో తెలుసా...అసలు అత్త చనిపోయి.....''

పంకజవల్లి చెప్పుకుంటూ పోతోంది.

"ఉన్న ఒక్క అత్తతో నువ్వే ఇంత గొప్ప లాభం పొందావ్! ప్లీజ్... నాకు కూడా అలాంటి అవకాశం ఇవ్వవూ. రేపు మన మామ చనిపోయాక ఆ ఏడిచే ఛాన్స్ నాకే ఇవ్వాలి...'' అంది పంకజవల్లి తోడికోడలు శ్రీలక్ష్మి.

☆